ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 25 | పేజీలు: 4 | వెల: రూ.3/- | ఆదివారం 5 మే 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్




## నేడు నీట్ ప్రవేశ పరీక్ష

### నిముషం ఆలస్యం అయినా నో ఎంట్రీ

హైదరాబాద్, మే 4 (ప్రభాత ఉదయం): దేశవ్యాప్తంగా వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం మే 5న నీట్ యూజీ-2024 ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నారు. ఆదివారం మే 5న మధ్యాహ్నం 2 గంటల నుంచి 5.20 గంటల మధ్య జరుగుతుంది. ఇప్పటికే అడ్మిట్ కార్డులను విడుదల చేసిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) పరీక్ష నిర్వహణకు అన్ని సన్నాహాలు పూర్తి చేసింది. ఈ పరీక్షకు 23,81,833 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇంగ్లీష్, హిందీ, తెలుగు కాకుండా, ఈ పరీక్ష మొత్తం 13 భాషలలో పెన్,పేపర్ విధానంలో నిర్వహించబడుతుంది. ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్ఎంఎస్, బీయూఎంఎస్, బీహెచ్ఎంఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ప్రతి ఏడాది ఈ పరీక్ష నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అభ్యర్థులు పరీక్ష మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. నిబంధనలకు, షరతులకు ..మిగతా 2లో

## ప్రచార జోరు పెంచిన కాంగ్రెస్



### నేడు రాష్ట్రానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్

### ఉదయం 11గంటలకు నిర్మల్‌లో ప్రచారసభ

### సాయంత్రం అలంపూర్‌లో మరో సభలో ప్రసంగం

న్యూఢిల్లీ, మే 4 (ప్రభాత ఉదయం): తెలంగాణలో లోక్‌సభ ఎన్నికలకు మరో వారం రోజుల సమయమే ఉంది. దీంతో కాంగ్రెస్ పార్టీ ప్రచార జోరును మరింత పెంచింది. కాంగ్రెస్ అధిష్టాన పెద్దలతో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించింది. ఇందులో భాగంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు తెలంగాణకు రానున్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో రెండుసార్లు రాష్ట్రంలో రాహుల్ ఎన్నికల ప్రచారం నిర్వహించేలా కాంగ్రెస్ షెడ్యూల్‌ను రూపొందించింది.ఆదివారం రాహుల్ రాష్ట్రానికి రానున్నారు. ఉదయం 11 గంటలకు నిర్మల్ బహిరంగ సభలో ఆయన పాల్గొంటారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు ఆలంపూర్ ..మిగతా 2లో

## కరసేవకులను దహనం చేసిన వారికి లాలూ అండ

### సోనియా హయాంలో లాలూ తీరు దారుణం

### బీహార్ ప్రచారంలో విమర్శలు పెంచిన ప్రధాని మోడీ



పాట్నా, మే 4 (ప్రభాత ఉదయం): లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో విపక్షాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వాగ్బాణాల జోరు పెరుగుతోంది. బీహార్‌లోని దర్భంగాలో శనివారంనాడు జరిగిన ఎన్నికల సభలో ఆర్జేడీ చీఫ్, బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్‌పై ఘాటు విమర్శలు చేశారు. 2002 గోద్రా రైలు దహనం ఘటనను ప్రస్తావిస్తూ, కరసేవకులను సజీవ దహనం చేసిని వారిని రక్షించేందుకు సోనియాగాంధీ హయాంలో లాలూ ప్రసాద్ యాదవ్ ..మిగతా 2లో

# రుణమాఫీ చేసి తీరుతాం

### హరీష్ రెడీగా ఉండు

### రిజర్వేషన్ల రద్దుకు బిజెపి కుట్రలు

### ఇది నిజం కాదని బిజెపి నేతలు చెప్పడం లేదు

### ఆర్ఎస్ఎస్ విధానాలు అమలు చేసే యత్నం

### కరెంట్ కోతలపై కెసిఆర్ విమర్శలు అర్థరహితం

### 7లక్షలకోట్లు అప్పు చేసి పెట్టిన ఘనుడు కెసిఆర్

### భద్రాద్రి కొత్తగూడెం సభలో సిఎం రేవంత్ వెల్లడి




కొత్తగూడెం, మే 4 (ప్రభాత ఉదయం): రిజర్వేసన్ల రద్దు చేస్తారని తాము చెబుతుంటే తెలంగాణ బిజెపి నేతలు ఎందుకు నోరు మెదపడం లేదని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. బిజెపి ఎజెండాలో రాజ్యాంగం రద్దు, రిజర్వేషన్ల రద్దు ప్రధానాంశంగా ఉందన్నారు. ఈ రెండు వద్దనుకుంటే కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలని ఆయన పిలుపునిచ్చారు. కొత్తగూడెం జనజాతర సభలో రేవంత్ మాట్లాడుతూ.. ఆగస్ట్ 15 నాటికి రైతుల రెండు లక్షల రుణమాఫీ చేసి, చూపుతామని, హరీష్ రావు రాజీనామాకు సిద్ధంగా ఉండాలని మరోమారు సవాల్ చేశారు. అలాగే కెసిఆర్ కరెంట్ కోతలపై చేస్తున్న విషప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. కేంద్రంలోని ఏ సంకీర్ణంలో చేరతారో కేసీఆర్ చెప్పాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. కొత్తగూడెంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. కేసీఆర్.. భాజపాలో చేరతారని మేం మొదటి నుంచి చెబుతున్నాం. కేంద్రంలో భాజపా చేసిన అన్ని చట్టాలకు భారాస మద్దతిచ్చింది. కాంగ్రెస్‌ను అడ్డుకునేందు కు ఆ రెండు పార్టీలు కలిసి కుట్రలు చేస్తున్నాయి. గుజరాత్‌ను ఓడిద్దాం.. తెలంగాణను గెలిపించుకుందాం రండి. రైతు భరోసా ఆగిపోయిందని కేసీఆర్ దుష్ప్రచారం చేస్తున్నారు. ఈ నెల 9 లోగా ఒక్క రైతుకైనా బకాయి ఉంటే ..మిగతా 2లో



## రోహిత్ వేముల కేసు పునర్విచారణ

హైదరాబాద్, మే 4 (ప్రభాత ఉదయం): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పీహెచ్‌డీ స్కాలర్ రోహిత్ వేముల ఆత్మహత్య కేసును తిరిగి విచారించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు డిజిపి ప్రకటన చేశారు. దేశవ్యాప్తంగా ఎంతటి దుమారం రేపిందో ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. తాజాగా.. ఈ కేసుపై తెలంగాణ హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. ఎనిమిదేళ్లుగా కొనసాగుతున్న ఈ కేసు విచారణను ముగిస్తున్నట్లు పోలీసులు హైకోర్టుకు తెలిపారు. రోహిత్ వేముల ఆత్మహత్యకు వీసీ అప్పారావుకు ఎలాంటి సంబంధం లేదని పోలీసులు నిర్ధారించారు. 2016లో రోహిత్ వేముల ఆత్మహత్యకు పాల్పడగా.. ఆత్మహత్యకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించలేదని పేర్కొన్నారు. దీంతో ఆత్మహత్యకు ఎవరూ కారణం కాదని తేల్చారు. అంతేకాదు.. రోహిత్ వేముల ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన యువకుడు కాదని కోర్టుకు సమర్పించిన రిపోర్ట్‌లో పేర్కొన్నారు. అయితే, రోహిత్ వేముల ఆత్మహత్య కేసును క్లోజ్ చేయడం తో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం యూనివర్సిటీలో ..మిగతా 2లో

## కాంగ్రెస్ పాలనలో మార్పు కనిపిస్తోంది

### మోటర్లు కాలుతున్నాయ్..కరెంట్ రావడం లేదు

### వడ్లు కొనే దిక్కు లేదు.. ఉన్న పథకాల్లో కోతలు

### ఐదు గ్యారెంటీల పేరుతో అబద్దాలు ప్రచారం

### రాష్ట్రంలో నిశ్శబ్ద విప్లవం మొదలయ్యింది

### మళ్లీ బిఆర్ఎస్‌కు అనుకూలంగా పరిస్థితులు

### పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీల కన్నా ఎక్కువ సీట్లు

### మీట్ దప్రెస్ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేత హరీష్ రావు



హైదరాబాద్, మే 4 (ప్రభాత ఉదయం): కాంగ్రెస్ చెప్పినట్టు రాష్ట్రంలో మార్పు మొదలైందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. కాంగ్రెస్ వచ్చాక మళ్లీ తాగునీటి కొరత వచ్చిందని, ప్రజలకు నీళ్ల కష్టాలు మొదలయ్యాయని, విద్యుత్ సరఫరాలో మార్పు మొదలైందన్నారు. కేసీఆర్ 24 గంటల కరెంటు ఇచ్చారని, కాంగ్రెస్ 15 గంటల విద్యుత్ కూడా ఇవ్వడం లేదని విమర్శించారు. హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో హరీశ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..బీజేపీ, కాంగ్రెస్ ఇచ్చే అబద్ధపు హామీలతో ప్రజల గుండెలు మండుతున్నాయన్నారు. కేసీఆర్ బస్సు యాత్రతో బీఆర్ఎస్‌కు అపూర్వ ప్రజాధరణ వస్తున్నది. మహిళలు, రైతులు, యువత కేసీఆర్‌కు స్వాగతం పలుకు తున్నారు. రాష్ట్రంలో నిశ్శబ్ద విప్లవం వస్తుంది. కాంగ్రెస్ బీజేపీ కంటే బీఆర్ఎస్‌కు ఎక్కవ సీట్లు వస్తాయన్నారు. కేసీఆర్ పాలనలో ఉన్నప్పుడు ఒక్క మోటర్ కూడా కాలలేదన్నారు. కాంగ్రెస్ ..మిగతా 2లో




# రుణమాఫీ చేసి తీరుతాం

మొదటి పేజీ తరువాయి...



క్షమాపణ చెబుతా. పంద్రాగస్టులోగా రైతు రుణమాఫీ అమలు చేసి హరీశ్‌రావు నోరు మూయిస్తాం అన్నారు. రాహుల్‌గాంధీని ప్రధానిగా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారు. కేసీఆర్ వైఖరిని ఖమ్మం జిల్లా ప్రజలు ముందే పసిగట్టారు. అందుకే 2014, 2019, 2023లో భారాసను దూరం పెట్టారు. ఇక్కడి ప్రజలు చైతన్యవంతులు.. ముందుచూపు ఎక్కువ. పదేళ్ల పాటు తెలంగాణకు ద్రోహం చేసింది భాజపానే. ఈ పదేళ్లలో రాష్ట్రానికి ఒక్కటైనా ఇచ్చారా? రాజ్యాంగాన్ని మారుస్తామని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శే చెప్పారు. రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను కాపాడుకునేందకు కాంగ్రెస్‌ను గెలిపించాల న్నారు. తెలంగాణకు గాడిద గుడ్డు ఇచ్చిన కాషాయ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయం. రూ.7 లక్షల కోట్ల అప్పుతో రాష్ట్రాన్ని కేసీఆర్ మాకు అప్పగించారు. భట్టి విక్రమార్క గట్టి వ్యక్తి కాబట్టి నిధులు సర్దుతున్నారు. అన్ని వర్గాల ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు ఇస్తున్నాం' అని రేవంత్‌రెడ్డి తెలిపారు. పదేళ్లుగా మోడీ తెలంగాణకు చేసిందేమీ లేదని..రేపు మరేదో చేస్తారన్న ఆశా లేదని ప్రధాని మోదీపై సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు. రాజ్యాంగాన్ని మార్చడం, రిజర్వేషన్లను రద్దుచేయడమే లక్ష్యంగా బిజెపి పనిచేస్తోందని అన్నారు. అందుకే కులగణన, జనాభా లెక్కల సేకరణ గత పదేళ్లుగా చేపట్టలేదని రేవంత్ రెడ్డి అన్నారు. బిజెపి ఎజెండా మేరకు ముందుకు సాగుతోందని సిఎం విమర్శలు చేశారు. కిషన్ రెడ్డి మంత్రిగా ఉండి తెలంగాణకు ఏం తెచ్చారని ప్రశ్నించారు. బయ్యారం ఉక్కు, వరంగల్ రైల్వే కోచ్ ఏం చేశారని నిలదీశారు. పదేళ్లు ప్రధానిగా ఉన్న నరేంద్ర మోదీ మూడోసారి అధికారంలోకి రావాలని 400 సీట్లు కావాలని అడుగుతున్నారని చెప్పారు. ఆ 400 సీట్లు రాజ్యాంగాన్ని మార్చడం కోసమే అడుగుతున్నారని ఆరోపించారు. గాంధీ కుటుంబానికి పదవులపై వ్యామోహం లేదని చెప్పారు. రాహుల్ గాంధీ ప్రధాని అయితే కానీ రిజర్వేషన్లు రద్దు కావని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు పెంచడమే కాకుండా బలహీనవర్గాల కులగణన కాంగ్రెస్ చేస్తుందని చెప్పారు. రిజర్వేషన్లే ప్రధాన అంశంగా లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సింగరేణినీ కాపడుతాం.. ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్ళనివ్వం డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అన్నారు. మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మూసివేసిన, కాలం చెల్లిన ధర్మల్ పవర్ స్టేషన్‌లను అందుబాటు లోకి తీసుకుని వస్తామన్నారు. ఫాం హౌ స్ కి వెళ్లి వచ్చిన కేసీఆర్ పదేళ్లు మొద్దు నిద్ర పోయారన్నారు. సింగరేణి నీ కాపడుతాం.. ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్ళనివ్వం రెప్పపాటు కూడా కరెంట్ పోకుండా ఇస్తున్నామన్నారు. కొత్తగూడెం స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీ తెరిపిస్తామన్నారు. రిజర్వేషన్ తొలగించడానికి బీజేపీ చేసిన ప్రయత్నం గురించే సీఎం రేవంత్ చెప్పారన్నారు. రేవంత్ రెడ్డి పై తప్పుడు కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. కేసుల పేరుతో ఆఫ్టార్ల్ మీరు ఢిల్లీకి పిలిపిస్తే మేము భయపడతామా?

అన్నారు. తప్పుడు ఆరోపణలు ప్రచారం చేస్తే చూస్తూ ఊరుకోమన్నారు.కార్యక్రమంలో , మంత్రులు తుమ్మల, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఎంపి అభ్యర్థులు రఘురామిరెడ్డి, నాయక్‌లు కూడా పాల్గొన్నారు.



## నేడు నీట్ ప్రవేశ పరీక్ష

మొదటి పేజీ తరువాయి...

పరీక్ష నిర్వహణ కు సంబంధించిన నీట్ ఉమ్మడి వరంగల్ జిల్లా సిటీ కోఆర్డినేటర్ మంజుల దేవి వివరాలను వెల్లడించారు. నిమిషం ఆలస్యమైన నో ఎంట్రీ అన్నారు. పరీక్షకు 5205 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంలో 9 పరీక్ష కేంద్రాలున్నాయన్నారు. ఉదయం 11:30 నుంచే పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఉంటుందన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్ తో పాటు ఏదైనా ఒక ఐడెంటిటీ ప్రూఫ్ వెంట తీసుకురావలసి ఉంటుందన్నారు.

## రోహిత్ వేముల కేసు పునర్విచారణ

మొదటి పేజీ తరువాయి...

పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. దీంతో కేసును మరోసారి దర్యాప్తు చేయాలని పోలీసులు నిర్ణయం తీసుకున్నారు. కేసును రీఓపెన్ చేయాలని తెలంగాణ డీజీపీ రవిగుప్తా నిర్ణయించారు. ఈ క్రమంలోనే పునర్విచారణకు అనుమతి కోరుతూ కోర్టులో తెలంగాణ పోలీస్ శాఖ పిటిషన్ దాఖలు చేయనున్నది.

## ప్రచార జోరు పెంచిన కాంగ్రెస్

మొదటి పేజీ తరువాయి...

ఎర్రవల్లి చౌరస్తాలో రాహుల్ సభ ఉండనుంది. అలాగే ఎన్నికలకు నాలుగు రోజుల ముందు మరోసారి రాహుల్ తెలంగాణకు రానున్నారు. ఈనెల 9న రాహుల్ మరోసారి తెలంగాణలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. 9వ తేదీన సరూర్ నగర్ స్టేడియంలో కాంగ్రెస్ బహిరంగ సభలో రాహుల్ గాంధీ పాల్గొని ప్రసంగిస్తారు. మరోవైపు ప్రియాంక గాంధీ కూడా తెలంగాణలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. అయితే ప్రియాంక ప్రచార షెడ్యూల్‌లో పలు మార్పులు చోటు చేసుకున్నాయి. 6న సాయంత్రం ప్రియాంక గాంధీ హైదరాబాద్‌కు రానున్నారు. 7న ఉదయం 11 గంటలకు కామారెడ్డి సభలో పాల్గొంటారు. సాయంత్రం కూకట్‌పల్లిలో కార్నర్ మీటింగ్‌లో ప్రసంగిస్తారు. అలాగే 8న భువనగిరి లేదా వరంగల్‌లో నిర్వహించే సభలో ప్రియాంక పాల్గొని ప్రసంగిస్తారు. అదే రోజు సాయంత్రం 6 గంటలకు సికింద్రాబాద్‌లో రోడ్ షోలో ప్రియాంక గాంధీ పాల్గొననున్నారు. ఇరువురు అగ్రనేతలు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండటంతో రాష్ట్ర తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఆయా ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్నారు.

## కరసేవకులను దహనం చేసిన వారికి లాలూ అండ

మొదటి పేజీ తరువాయి...

ప్రయత్నించారని ఆరోపించారు. కల్లోలిత సమయాల్లో కూడా బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడటం విపక్షాలకు ఆనవాయితీగా మారిందని ఎద్దేవా చేశారు. బుజ్జగింపు రాజకీయాల కారణంగానే బీహార్ షెహజాదా (తేజస్వి యాదవ్) తండ్రి (లాలూ) గోద్రా రైలు దహనకాండకు పాల్పడిన వారిని కాపాడే ప్రయత్నం చేశారని, సోనియాగాంధీ హయాంలో ఇది జరిగిందని ప్రధాని చెప్పారు. పశుగ్రాసం కుంభకోణంలో దోషి అయిన లాలూ అప్పుడు రైల్వే శాఖ మంత్రిగా ఉన్నారని తెలిపారు. ఆయన ఒక దర్యాప్తు కమిటీని కూడా వేశారని, గోద్రా అమానుష ఘటనకు పాల్పడినట్టు చెబుతున్న వారిపై క్రిమినల్ ఆరోపణల్లో నిజం లేదంటూ నివేదిక తెప్పించుకున్నారని, అయితే ఆ నివేదికను కోర్టు చెత్తబుట్టలో పడేసిందని మోదీ చెప్పారు. రాహుల్, తేజస్వి యాదవ్ పేర్లను ప్రధాని నేరుగా ప్రస్తావించకుండా వారిపై వ్యంగ్యోక్తులు గుప్పించారు. 'ఢిల్లీలో ఒక యువరాజు ఉన్నాడు. పాట్నాలో కూడా ఒక యువరాజు ఉన్నాడు. ఒక యువరాజు చిన్నప్పటి నుంచి ఈ దేశాన్ని తన రాజ్యంగా అనుకుంటూ ఉంటాడు. మరో యువరాజు బీహార్ తన రాజ్యం అనుకుంటాడు. ఇద్దరి రిపోర్టు కార్డులు కూడా ఒక్కటే. స్కాములు, ఆటవిక పాలన తప్ప వారి ప్రోగ్రెస్ కార్డులో ఏవీ కనిపించవు' అని మోదీ విమర్శించారు. ముస్లింలకు రిజర్వేషన్లు అంటూ రిజర్వేషన్ల అంశాన్ని 'ఇండియా' కూటమి తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తోందని ఆయన విమర్శించారు. మతం పేరుతో రిజర్వేషన్లు ఉండరాదనే బాబా సాహెబ్ అంబేద్కర్, తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ అభిప్రాయాలకు భిన్నంగా కూటమి నేతలు వ్యవహరిస్తున్నారని తప్పుపట్టారు.

## ఉత్తరాఖండ్‌లో ఘోర ప్రమాదం

### లోయలో పడ్డ కారు..నలుగురు విద్యార్థుల మృతి



డెహ్రాడూన్, మే 4 (ప్రభాత ఉదయం): టూర్‌కు వెళ్లిన ఐదుగురు విద్యార్థులు ఘోర రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషాద సంఘటన ఉత్తరాఖండ్ లోని.. పానీ వాలా బ్యాండ్ సమీపంలో చోటు చేసుకుంది. డెహ్రాడూన్ ఐఎమ్ఎస్ కాలేజీకి చెందిన నలుగురు అబ్బాయిలు, ఇద్దరు అబ్బాయిలు టూర్‌కు వెళ్లారు. అక్కడ పర్యటన ముగించుకుని తిరిగి వస్తున్న క్రమంలో పానీ వాలా బ్యాండ్ సమీపంలో లోతైన గుంటలో కారు పడిపోయింది. దీంతో కారులో ఉన్న ఆరుగురిలో ఐదుగురు మృతి చెందారు. నాన్సీ అనే యువతికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని గాయాలపాలైన యువతిని చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న యువతి పరిస్థితి విషమంగా ఉందని.. ఎస్పీ సిటీ ప్రమోద్ కుమార్ తెలిపారు.



ఎమ్మెల్యే వివేకానంద ఇంట్లో పని చేస్తున్న జిహెచ్ఎంసి పారిశుద్ధ్య కార్యక్రమం

## ప్రజా ప్రతినిధుల ఇండ్లలో మున్సిపల్ కార్మికులతో పనులు చేయించడం మరి దారుణం: వనంపల్లి జైపాల్ రెడ్డి

### ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ ఇంట్లో పాచి పనులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

కుత్బుల్లాపూర్, మే4(ప్రభాత ఉదయం) జిహెచ్ఎంసి పారిశుద్ధ్య కార్మికుల చేత వెట్టి చాకిరి చేయించుకుంటున్న కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద పై చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. జిహెచ్ఎంసి కార్మికురాలు ఎమ్మెల్యే వివేకానంద ఇంట్లో గత కొన్ని సంవత్సరాలుగా వెట్టి చాకిరి పని చేస్తుందని సర్కిల్ కు చెందిన పారిశుధ్య కార్మికులు ఏఐటియుసి నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ... కుత్బుల్లాపూర్ బిఆర్ఎస్ పార్టీ వివేకానంద గౌడ్ ఎమ్మెల్యే నివాసముంటున్న ప్రాంతం దండిముడి కాలనీ 132వ డివిజన్ పరిధిలో నివాసముంటున్నాడు ఎమ్మెల్యే ఇంట్లో ప్రతిరోజు పారిశుద్ధ్య కార్మికులను వారి ఇంట్లో విధులు నిర్వహించడానికి పారిశుద్ధ్య కార్మికులను ముగ్గురిని క్రమం తప్పకుండా ప్రతిరోజు వారి పేర్లు యశోద, కవిత, నిర్మల, రేఖ, ప్రతిరోజు శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్స్ అనిల్ పారిశుద్ధ్య కార్మికులకు ఉదయం హాజరు తీసుకొని ఎమ్మెల్యే ఇంటికి పంపించడం జరుగుతుంది. అధికారులు కూడా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవ స్తున్నారు. ఎమ్మెల్యేకు ప్రతినెల ప్రభుత్వము నుండి జీతభత్యాలు ఇస్తారు వారు వేరే వారితో ఇంట్లో పనులు చేయించుకోవాలి. పారిశుధ్య కార్మికులతో ఎమ్మెల్యే ఇంట్లో పనులు చేయించే వారిపై గ్రేటర్ కమిషనర్ రోనాల్డ్ రోస్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. లేదంటే ఏఐటియుసి ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాల నిర్వహిస్తామని హెచ్చరిస్తున్నాము కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా మున్సిపల్ సంఘం కార్యదర్శి చర్లపల్లి రాములు తదితరులు పాల్గొన్నారు.



## బిఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో భారీగా చేరిన మైనారిటీ నాయకులు

### మైనార్టీలకు, బడుగు, బలహీన వర్గాలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ ఉంటుంది:శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్..

కూకట్‌పల్లి, మే 5 (ప్రభాత ఉదయం): ప్రజల ఆశీర్వాదం బలంగా ఉందని,శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ తిరుగులేని మెజార్టీ సాధిస్తుందని, చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థిని గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసుకొనే అవకాశం ఉందని శేర్లింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ జగదీశ్వర్ గౌడ్ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని మిత్ర హిల్స్ నాయకులు శనివారం సయ్యద్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో మున్న ,రఫీ ,మొహమ్మద్ షఫీ, గౌస్, సత్తార్, ఇర్ఫాన్, మొహమీద్ ఖాదీమ్, షేబినా, ఎండి గౌస్, ఎండి ఖాజా, సయ్యద్ అలీ, ఎస్.కె యాకుబ్, సయ్యద్ కాలీమ్, యాసిన్, ఫిరోజ్ లు శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ జగదీశ్వర్ గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం వారికి కాంగ్రెస్ పార్టీ కండువాను కాపీ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో సిటీకి అనుకోని ఉన్న శేరిలింగంపల్లి అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని, ప్రభుత్వం నుంచి భారీగా నిధులు తీసుకువచ్చి నియోజకవర్గంలోని అన్ని డివిజన్లను అభివృద్ధి చేస్తామని అన్నారు. అందుకు కార్యకర్తలు సిపాయిల్లా పనిచేలాని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రదీప్, అరుణ యాదవ్, మున్న, రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో మార్పు కనిపిస్తోంది

మొదటి పేజీ తరువాయి...

వచ్చాక మోటర్లు కాలిపోతున్నాయని చెప్పారు. 'ప్రభుత్వ దవాఖానల్లో డెలివరీలు తగ్గిపోయాయి. ప్రతిపక్షాలతో జైళ్లను నింపడంలో మార్పు మొదలైంది. కొత్త పథకాలు రాలేదు, ఉన్న పథకాల్లో కోతలు వచ్చాయి. ఆరు గ్యారంటీల్లో ఒక్కటైనా అమలయ్యిందా?. ఐదు గ్యారంటీలు అమలు చేశామని అబద్దాలు చెప్తున్నారు. మొదటి గ్యారంటీ మహాలక్ష్మి అమలు చేశారా? రెండో గ్యారంటీ రైతులకు రుణమాఫీ, బోనస్ ఇచ్చారా?, మూడో గ్యారంటీ ఇంటి స్థలం ఎవరికైనా ఇచ్చారా? నాలుగో గ్యారంటీ నిరుద్యోగ భృతి ఇవ్వలేదు? ఐదో గ్యారంటీ చేయూత ఫెయిల్. గృహజ్యోతి కూడా పాక్షికంగానే అమలుచేశారు. 90 లక్షల మంది ఉంటే 30 లక్షల మందికి గృహజ్యోతి ఇచ్చారు. రైతులకు మోసం, మహిళలకు మోసం, పేదలకు మోసం. కాంగ్రెస్ మోసం చేయని మనిషి లేడు. రైతులకు ఇచ్చిన ఒక్క హామీ కూడా కాంగ్రెస్ నిలబెట్టుకోలేదు. అన్నవస్త్రాల కోసం పోతే ఉన్న వస్త్రాలు పోయినట్టయ్యింది. బాండ్ పేపర్ బౌన్స్ చేసిన కాంగ్రెస్‌కు శిక్ష వేయాలని ప్రజలు నిర్ణయించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రామిసరీ నోట్లు.. ఇప్పుడు ప్రతి ఊరి దేవుడిపై ఓట్లు. బాండ్ పేపర్ రాసిచ్చి మోసం చేసిన కాంగ్రెస్‌కు ప్రజలు గుణపాఠం చెబుతారు. రైతుబంధు రాలేదంటే చెప్పుతో కొడతామని ఓ మంత్రి అన్నడు. మంత్రి తుమ్మలకే రైతుబంధు రాలేదన్నారు.రాష్ట్రం పరువు తీసేలా సీఎం రేవంత్ భాష, వ్యవహార శైలి. రేవంత్ భాషను తెలంగాణ ప్రజలు అంగీకరించడం లేదు. తెలంగాణ సాధించిన కేసీఆర్ పట్ల రేవంత్ భాషను ప్రజలు ఆమోదించడం లేదు. యువతకు, భవిష్యత్ తరానికి రేవంత్ ఏం సందేశం ఇస్తున్నారు?. కేసీఆర్ చేసినవాటికి వ్యతిరేకంగా చేయడమే రేవంత్ ఉద్దేశం. కొత్త జిల్లాలను తీసేస్తామని రేంత్ అంటున్నరు. కొత్త జిల్లాల వల్ల పరిపాలన ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. రోజూ ప్రజలను కలుస్తానని చెప్పిన సీఎం.. మొదటి రోజు తప్ప మళ్లీ కనిపించలేదు. 3.50 లక్షల దరఖాస్తులు వస్తే ఎన్ని పరిష్కరించారో చెప్పలేదన్నారు. ప్రతిపక్ష నేతలు, కార్యకర్తలపై కాంగ్రెస్ ప్రభుత్వం వేధింపులకు పాల్పడుతున్నది. పార్టీలు మారినవారిని రాళ్లతో కొట్టాలన్న రేవంత్ ఇప్పుడు చేస్తున్నదేంటి?. పార్టీ మారితే వెంటనే అనర్హత వేటు వేయాలని కాంగ్రెస్ మేనిఫెస్టోలో చెప్పారు. కానీ, బీఆర్ఎస్ నుంచి చేర్చుకున్న ఎమ్మెల్యేలున్న వేదికపైనే మేనిఫెస్టో ప్రకటించారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కయ్యాయి. తెలంగాణలోని ఏడు మండలాలను, సీలేరు ప్రాజెక్టుని కేంద్రం ఏపీలో కలిపింది. బీజేపీ ప్రభుత్వం బిల్లు పెడితే కాంగ్రెస్ మద్దతిచ్చింది. దానిని బీఆర్ఎస్ వ్యతిరేకించింది. హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా కొనసాగించాలని కుట్ర చేస్తున్నారు. పార్లమెంటులో బీఆర్ఎస్ ఎంపీలుంటేనే ఉమ్మడి రాజధాని కుట్రను అడ్డుకుంటారు. వడ్లు కొనడం చేతగాని బీజేపీ తెలంగాణలో ఓట్లు ఎలా అడుగుతుంది?. నూకలు బుక్కమన్న ఆ పార్టీకి తెలంగాణ రైతులు ఎందుకు ఓటు వేయాలి. బీజేపీ తెలంగాణకు ఏమిచ్చిందని ఓట్లు అడుగుతున్నది. బీజేపీ పాలనలో అదానీ ప్రపంచ కుబేరుడయ్యాడు. కేసీఆర్ కంటే ధార్మికుడు, భక్తుడు బీజేపీలో ఎవరూ లేరు. గతంలో దేవాలయాల నిధులు ఇతర అవసరాలకు వాడేవారు. కానీ, దేవాలయాలకు ప్రభుత్వ నిధులు ఇచ్చింది కేసీఆర్ మాత్రమేనని అన్నారు. రాష్ట్రం దివాళా తీసిందని ముఖ్యమంత్రి చెప్పవచ్చా. ఇప్పటికే రియల్ ఎస్టేట్ రంగం కుదేలైంది. నిర్మాణరంగంపై ఆధారపడిన లక్షల మంది రోడ్డునపడ్డారు. రేవంత్ బీజేపీలో చేరుతారని ఆ పార్టీ నేతలే చెబుతున్నారు. పార్టీ మార్పు విషయమై బీజేపీ వ్యాఖ్యలను సీఎం రేవంత్ ఎందుకు ఖండించడం లేదు. మోదీ ఆశీర్వాదం కావాలని రేవంత్ రెడ్డి కోరుతున్నారు. 8 సీట్లలో బీజేపీ గెలుపునకు రేవంత్ సహకరిస్తున్నారు. ముస్లింలు, క్రైస్తవులు కాంగ్రెస్, బీజేపీలను ఓడించాలి. బీజేపీతో కలిస్తే జోడీ.. లేకుంటే ఈడీ. అక్రమ కేసులో ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేశారు.÷ఎస్లిం మైనార్టీలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది. బీఆర్ఎస్ సెక్యులర్ పార్టీ. మైనార్టీలకు అండగా ఉంటుంది. కేంద్రంలో ఈసారి వచ్చేది సంకీర్ణ ప్రభుత్వమే. ఎక్కువమంది బీఆర్ఎస్ ఎంపీలుంటేనే తెలంగాణ కోసం కొట్లాడతారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరినవాళ్లను ప్రజలు అసహ్యించుకుంటున్నారు. తాము అత్యధిక సీట్లు గెలుస్తున్నాం.. మాకు ఆ విశ్వాసం ఉంది. మాదిగలకు ఎంపీ టికెట్ ఇవ్వకుండా కాంగ్రెస్ అన్యాయం చేసింది. ఎస్సీ వర్గీకరణపై బీజేపీ మేనిఫెస్టోలో మాట కూడా లేదు' అని హరీశ్ రావు అన్నారు.

## రాష్ట్రంలో భానుడి భగభగలు

### వడగాలులతో జనం ఉకిరిబికిరి

### రానున్న 4 రోజుల్లో 48 డిగ్రీలకు చేరనున్న ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, మే 4 (ప్రభాత ఉదయం) రాష్ట్రంలో నిప్పుల వర్షం కురుస్తూనే ఉంది. భానుడి భగభగలతో ప్రజలంతా విలవిల్లాడిపోతున్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల పైనే నమోదవుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలతో పాటు వేడిగాలులు తీవ్రంగా వీస్తున్నాయి. మరో మూడు, నాలుగు రోజులపాటు వాతావరణ పరిస్థితులు ఇలాగే ఉంటాయని, పగటి పూట ఉష్ణోగ్రతలు 45 నుంచి 48 డిగ్రీలకు చేరే అవకాశం ఉందని వాతావరణశాఖ అంచనా. శనివారం 58 మండలాల్లో తీవ్ర వడగాలులు,169 మండలాల్లో వడగాలులు వీచినట్టు విపత్తుల సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ వెల్లడించారు. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఏపీ, తెలంగాణలోని పలు జిల్లాల్లో రెడ్ అలర్ట్, మరికొన్ని జిల్లాల్లో ఆరెంజ్ అలర్టులు కొనసాగుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతేనే తప్ప ఇండ్ల నుంచి బయటకు రావొద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.

## మోడీ నాయకత్వంలో దేశం సురక్షితం

### కొండా విశ్వేశ్వర్ రెడ్డి

### మోడీకి మద్దతుగా ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలి



వృద్ధుడిని కమలం గుర్తుకు ఓటు వేయమని కోరుతున్న బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి



మహిళను ఓటు అభ్యర్థిస్తున్న చేవెళ్ల బిజెపి ఎంపీ అభ్యర్థి కొండా

శంషాబాద్, మే 4 (ప్రభాత ఉదయం)దేశంలో కుల, మత, ప్రాంతీయ బేధాలకు అతీతంగా ప్రజలంతా నరేంద్ర మోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని చేవెళ్ల పార్లమెంట్ బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. నరేంద్ర మోడీ నాయకత్వాన్ని బలపరచడం కోసం తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కొండా విశ్వేశ్వర్ రెడ్డి సూచించారు రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని శంషాబాద్ మండలం నర్కుడ గ్రామంలో చాయ్ పై చర్చ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నర్కుడ గ్రామంలో విశేష స్పందన లభించింది.. సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయ పార్టీలకు కులమతాలకు అతీతంగా తామంతా కొండా విశ్వేశ్వర్ రెడ్డికే ఓటేసి భారీ మెజార్టీతో గెలిపిస్తామని గ్రామస్తులు స్పష్టం చేశారు.ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... మరోసారి నరేంద్ర మోదీని ప్రధానమంత్రిని చేయడానికి యావత్ దేశం మొత్తం సిద్ధమైందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలతో చేవెళ్ల ప్రాంత ప్రజలకు నరేంద్ర మోదీ చేరువయ్యారని ఆయన చెప్పారు. రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్, ఫసల్ బీమా, ప్రధానమంత్రి ఆవాస్ యోజన వంటి పథకాలు అమలు చేయకపోవడం వల్ల స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కొండా విశ్వేశ్వర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుక్క వేణుగోపాల్. డాక్టర్ ప్రేమ్ రాజ్ యాదవ్. మైలార్దేవ్ పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి. ఓబీసీ సెల్ జిల్లా కార్యదర్శి నాన్న వాళ్ల కుమారి యాదవ్. ఎంపీటీసీ బుక్క ప్రవీణ్ కుమార్. బూర్కుంట గోపాల్ . కనకమామిడి కిట్టు ముదిరాజ్. బూర్కుంట సంజీవ. మెండే కుమార్ యాదవ్. సునిగంటి సిద్ధులు. బూర్కుంట భాస్కర్. నాగేశ్వరరావు. శ్రీనివాస్. నాగేష్ గౌడ్. తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ముందు కూర్చున్న ఇద్దరు నాయకులపై మజ్లీస్ కార్యకర్త కత్తులతో దాడి


హత్యకు గురైన మక్బుల్


గాయపడ్డ మనోజ్ కుమార్



ఇంద్రానగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం


దాడి చేసిన అంజద్


వివరాలు వెల్లడిస్తున్న రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్

### ఈ సంఘటనలో ప్రాణాలు కోల్పోయిన మక్బుల్
### పాత కక్షలే ఈ దాడికి కారణం

బుద్వేల్, మే4(ప్రభాత ఉదయం): సులేమాన్ డివిజన్ పరిధిలోని ఇంద్రానగర్ చౌరస్తాలో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ముందు కూర్చుని తమ నాయకుని కోసం ఎదురుచూస్తున్న ఇద్దరు కాంగ్రెస్ నాయకులపై మజ్లీస్ పార్టీ కార్యకర్తగా భావిస్తున్న అంజద్ (45) అనే యువకుడు కత్తులతో దాడి చేశాడు ఈ సంఘటనలో తీవ్ర గాయాలకు గురైన మక్బుల్ ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు . మనోజ్ కు తీవ్ర గాయాలయ్యాయి.

**కాంగ్రెస్ రోడ్ షో ఉండడంతో.....**

శనివారం సాయంత్రం సులేమాన్ నగర్ డివిజన్, శాస్త్రిపురం డివిజన్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి రోడ్ షో ఉంది. అందుకోసం సులేమాన్ నగర్ డివిజన్ ఇంద్రానగర్ చౌరస్తాలో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఆ పార్టీ నాయకులైన మక్బూల్( 55 ), మనోజ్ (45) లతోపాటు మరికొంతమంది కార్యకర్తలు కూర్చుని ఉన్నారు. 200 మంది వరకు కాంగ్రెస్ అభిమానులు ఉన్నారు.

**కత్తులతో దాడి చేసిన అంజద్**

పార్టీ కార్యాలయం వద్ద కూర్చున్న మక్బుల్ వద్దకు వచ్చిన అంజద్ తన వద్ద ఉన్న కత్తులను తీసి మక్బుల్ పై విచక్షణ రహితంగా కడుపులో పొడిచాడు. అడ్డుకోబోయిన మనోజ్ ను కూడా గాయపరిచాడు. వెంటనే పోలీసులు, స్థానికులు మక్బుల్, మనోజ్ ను ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మక్బూల్ మరణించినట్లు రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ తెలిపారు. దాడికి గల కారణాలు తెలియరా లేదని తెలిపారు. ఆర్థిక లావాదేవీలా.. మరే ఇతర సమస్యల కారణంగా ఈ దాడి జరిగిందా అనే వివరాలను తెలుసుకుంటున్నామన్నారు.

**పాత కక్షల కారణంగానే**

మక్బూల్, అంజద్ లు గత శాసనసభ ఎన్నికలలో కూడా గొడవ పడ్డట్లు స్థానికులు చెబుతున్నారు. అదే మనసులో పెట్టుకొని మక్బుల్ పై అంజద్ దాడి చేసి ఉంటాడని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. రౌడీ షీటర్, దివంగత హాజీల ముఖ్య అనుచరులు మక్బుల్, మనోజ్‌లు అంజద్ చేతిలో హత్యకు గురైన మక్బుల్ తో పాటు గాయపడ్డ మనోజ్ కుమార్ 10 సంవత్సరాల క్రితం హత్యకు గురైన రౌడీ షీటర్ హాజీకి ప్రధాన అనుచరులుగా ఉన్నారు. హాజీ హత్యానంతరం వారు సాధారణ జీవితాన్ని గడుపుతూ వచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తిరిగి చురుకుగా వ్యవహరిస్తున్నారు. ఇంతలోనే వారిపై దాడి జరగడం అందులో మక్బుల్ మరణించడం స్థానికంగా కలకలం రేపింది.





# ఈ అభ్యర్థులు.. వారి ఓటు వారికే వేసుకోలేరు

బుద్వేల్, మే4(ప్రభాత ఉదయం): తెలంగాణ లోక్ సభ ఎన్నికల్లో కొంతమంది అభ్యర్థులు తమ ఓటును తాము (తమకు) వేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. కారణం వారికి ఇతర నియోజకవర్గాల్లో ఓటు ఉండటమే. హైదరాబాద్ మజ్లీస్ ఎంపీ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ ఓటు చేవెళ్ల పరిధిలో ఉంది. హైదరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవీలత ఓటు మల్కాజిగిరిలో పరిధిలో ఉంది. హైదరాబాద్ లోక్ సభ కాంగ్రెస్ అభ్యర్థి మహ్మద్ సమీర్ ఓటు సికింద్రాబాద్ పరిధిలో ఉంది. దీంతో వారి ఓటు వారికి వేసుకోలేని పరిస్థితి నెలకొంది.


శంషాబాద్ పట్టణంలో కాసాని జ్ఞానేశ్వర్ కోసం ప్రచారం చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

# కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలి

### కావలి సతీష్

శంషాబాద్, మే 4 (ప్రభాత ఉదయం): చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గానికి జరుగుతున్న ఎన్నికల్లో బడుగు బలహీన వర్గాల నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్ భారీ సంఖ్యలో మెజార్టీతో గెలిపించాలని శంషాబాద్ మున్సిపల్ టిఆర్ఎస్ బీసీ సెల్ అధ్యక్షుడు కావలి సతీష్ పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం 12వ వార్డులో ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. టిఆర్ఎస్ పార్టీ అధికారాన్ని కోల్పోయిన కొద్ది రోజుల్లోనే ప్రజలకు అనేక సమస్యలు ఎదురవుతున్నాయని వాటిని పరిష్కరించాలంటే మళ్ళీ టిఆర్ఎస్ పార్టీని గెలిపించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అసమర్థ నాయకత్వంలో ప్రజలు ఓవైపు మంచినీటి సమస్య మరోవైపు విద్యుత్ సమస్యతో సతమతమవుతున్నారని అన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ను గెలిపిస్తేనే అభివృద్ధి సాధ్యమైతుందని కావలి సతీష్ అన్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఊటిపల్లి మాజీ ఉపసర్పంచ్ కృష్ణ కుమార్. 12వ వార్డు టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొమ్మూరి విజయ్ కుమార్ గౌడ్. పార్టీ సీనియర్ నాయకులు కొమ్మూరి మనోహర్ గౌడ్. ఎస్. రమేష్. జి. కిరణ్ . సిద్ధులు తదితరులు పాల్గొన్నారు.

# పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను జాగ్రత్తగా నిర్వహించాలి

### చేవెళ్ళ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ శశాంక

బుద్వేల్, మే4(ప్రభాత ఉదయం): పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకునేందుకు వీలుగా రాజేందర్ నగర్ ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్ ను రిటర్నింగ్ అధికారి శశాంక శనివారం పరిశీలించారు. రెండవ రోజైన శనివారం చేవెళ్ళ పార్లమెంట్ నియోజక వర్గంలోని రాజేందర్ నగర్ అసెంబ్లీ సెగ్మెంట్ పోస్టల్ బ్యాలెట్ సేకరణ కోసం చేసిన ఏర్పాట్లను పరిశీలించి, పోలింగ్ రిజిస్ట్రేషన్, ఓటర్స్ రిజిస్ట్రేషన్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఓటింగ్ సరళి వివరాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటింగ్ ప్రక్రియను రిటర్నింగ్ అధికారి పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ పారదర్శకంగా, ప్రశాంతగా జరిగేలా చూడాలని, ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తూ ఎన్నికల సంఘం నియమ, నిబంధనలకు అనుగుణంగా పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఓటరు హెల్ప్ లైన్ కౌంటర్ వద్దనే ఓటరు జాబితాలోని క్రమ సంఖ్య, పార్ట్ నెంబర్ ను చెక్ చేసుకోవాలని అన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే ఉన్నతాధికారులను సంప్రదించాలని, అనవసర తప్పిదాలకు పాల్పడకూడదని సూచించారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగులు మే 8వ తేదీ వరకు నిర్వహించు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని రిటర్నింగ్ అధికారి తెలిపారు. ఈ పరిశీలనలో రిటర్నింగ్ అధికారి కలెక్టర్ వెంట రాజేందర్ నగర్ ఎఆర్ఓ వెంకట్ రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండేది పత్రికలు

### మల్కాజ్గిరి పార్లమెంటు నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి




కూకట్‌పల్లి, మే 5 (ప్రభాత ఉదయం): ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండేది పత్రికలేనని మల్కాజ్గిరి పార్లమెంటు నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి అన్నారు. సియాసత్ ఉర్దూ పేపర్ 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మూసాపేట రాయల్ ఫంక్షన్ హాల్ లో శుక్రవారం రాత్రి అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి మల్కాజ్గిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్రెడ్డి, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు రావడం అవినీతిని వెలికితీయడంలో పత్రికలు ప్రసారమాధ్యమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఒక పత్రిక 75 సంవత్సరాలు మముగడ సాగించడం గొప్ప విషయం అభినందనీయం అన్నారు. పత్రిక నడపాలంటే ఎంతో వ్యయ ప్రయాసలు ఖర్చుతో కూడుకున్న వ్యవహారం అన్నారు. దేశం కోసం ప్రాణాలు ధార పోసింది దేశానికి దశ దిశ చూపింది కాంగ్రెస్ పార్టీ మాత్రమే అన్నారు గత పది సంవత్సరాలుగా బిజెపి హయాం లో దేశ ప్రజలకు వరిగింది ఏమీ లేదన్నారు జీఎస్టీ పేరుతో దేశ ప్రజలపై మోయలేని భారాన్ని మోపిందన్నారు ఒకసారి కాంగ్రెస్ కు అవకాశం ఇస్తే అభివృద్ధికి అవకాశం ఇచ్చినట్లు అవుతుందన్నారు. కార్యక్రమంలో సియాసత్ పేపర్ ఎండి అమీర్ అలీ ఖాన్, టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, ఓబీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వేణు, నియోజకవర్గ కోఆర్డినేటర్ వినయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చేవెళ్ల ఎంపీ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఘనవిజయం ఖాయం

### బిజెపి రాష్ట్ర నాయకులు అడికె రాజు
### బిజెపిపై ప్రజల నుండి విశేష స్పందన

రాజేంద్రనగర్, మే 4(ప్రభాత ఉదయం) మైలార్ దేవ్ పల్లి డివిజన్ ప్రాంతంలో పద్మశాలి పురం, మధువన్ కాలనీ, హౌ సింగ్ బోర్డ్ కాలనీ లలో భారతీయ జనతా పార్టీ అభ్యర్థి కొండ విశ్వేశ్వర్ రెడ్డి కి మద్దతుగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా బిజెపి ఓబిసి మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడికే రాజు మాట్లాడుతూ... దేశం యావత్తు ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. ప్రజలు ఆలోచించి చేవెళ్ల బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డిని హరి మెజార్టీతో కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రాష్ట్ర ఓబిసి మోర్చా కార్యవర్గ సభ్యులు అడికే రాజు, ఎస్ ప్రమోద్ రెడ్డి, అక్కిం జయశంకర్ , తెలంగాణ అడిగే మహేందర్ , నాయక్ ఇతర నాయకులు పాల్గొన్నారు



ప్రచారం నిర్వహిస్తున్న స్నున్న బిజెపి నాయకులు అడికె రాజు, ప్రమోద్ రెడ్డి లు

# హ్యాట్రిక్ ప్రధానిగా నరేంద్ర మోడీని చూడాలని దేశ ప్రజల ఆకాంక్ష


మహిళను కమలం గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న బిజెపి రాష్ట్ర నాయకులు బొక్క బాల్ రెడ్డి


శివరాంపల్లిలో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి తో కలిసి ప్రచారం చేస్తున్న బొక్క బాల్ రెడ్డి


ఓటర్లను కమలం గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న బిజెపి నాయకులు

### బిజెపి రాష్ట్ర నాయకులు బొక్క బాల్ రెడ్డి
### శివరాంపల్లి లో ఇంటింటికి ప్రచారం చేసిన బిజెపి నాయకులు
### ప్రజల నుంచి బిజెపి పట్ల విశేష స్పందన

రాజేంద్రనగర్, మే 4(ప్రభాత ఉదయం) హ్యాట్రిక్ ప్రధానిగా ప్రధాని నరేంద్ర మోడీని చూడాలని దేశ ప్రజల ఆకాంక్ష అని బిజెపి రాష్ట్ర నాయకులు బొక్క బాల్ రెడ్డి అన్నారు. శనివారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని రాజేందర్ నగర్ డివిజన్ లోని ఉప్పరపల్లి, శివరాంపల్లి లలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ ఓటర్లకు కేంద్ర ప్రభుత్వ పథకాలు వివరిస్తూ కమలం గుర్తుకు ఓటు వేయాలని కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకులు బొక్క బాల్ రెడ్డి అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి భారీ మెజార్టీతో ప్రజలు గెలిపించడానికి ఉత్సాహంగా ఉన్నారన్నారు. గత ఐదు సంవత్సరాల నుండి ప్రతి ఒక్కరికి బియ్యం రేషన్ షాప్ ల ద్వారా మోడీ ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు అందిస్తుందన్నారు. కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రతి ఒక్కరికి అండగా ఉంటుందని పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల బిజెపి అభ్యర్థి విశ్వేశ్వర్ రెడ్డి కి ఓటు వేసే దేశానికి మరోసారి నరేంద్ర మోడీని ప్రధాని చేయాల్సిన అవసరం ఉందన్నారు.భారతదేశం విశ్వగురు స్థానంలో నరేంద్ర మోడీ ని చూడాలని హ్యాట్రిక్ ప్రధానమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారు ఈ కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు డి సత్యనారాయణ ముదిరాజ్, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, రాజేంద్రనగర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు బాబురావు, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు రాహుల్ రెడ్డి, చేవెళ్ల పార్లమెంట్ సోషల్ మీడియా కన్వీనర్ కొత్త సోల్కర్ రెడ్డి, ఓబిసి మోర్చా నాయకులు హరికిషన్ , బిజెపి నాయకులు గోనె శ్రీకాంత్ రెడ్డి ,విజయ వై ఎమ్ వైస్ ప్రెసిడెంట్ విట్టల్ సప్ప రాజుపాలెం రెడ్డి, ధర్మేందర్ రెడ్డి, నర్సింగ్ రావు, పెద్ద బాల్ రెడ్డి, గోనెమోహన్ రెడ్డి, అజయ్ కాంత్ రెడ్డి, పవన్ ,కర్ణాకర్ ,వంశీ, పెంటారెడ్డి, ఇంద్రారెడ్డి సన్నీ, రాజు, బిజెపి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ హోమ్ ఓటింగ్

### పర్యవేక్షించిన రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక



ఇంటి వద్ద నే ఓటు వేస్తున్న వయో వృద్ధులు

బుద్వేల్, మే 4 (ప్రభాత ఉదయం): ఇంటి నుంచి ఓటు సేకరించే (ఓట్ ఫ్రమ్ హోమ్) ప్రక్రియను చేవెళ్ళ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ పకడ్బందీగా నిర్వహిస్తున్నామని రిటర్నింగ్ అధికారి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక తెలిపారు. శనివారం రాజేందర్ నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని హైదర్ గూడ , అత్తాపూర్ వాసుదేవ్ నగర్ లో సీనియర్ సిటిజన్లు, దివ్యంగులు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక సమక్షంలో హోమ్ ఓటింగ్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హోమ్ ఓటింగ్ ప్రక్రియ శనివారం ప్రారంభమవగా, ఈ నెల 6వ తేదీ వరకు కొనసాగుతుందని అన్నారు. మొదటి రోజున చేవెళ్ళ పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఎన్నికల బృందాలు ఆయా రూట్ల వారీగా తమకు నిర్దేశించిన ఓటర్ల ఇళ్ల వద్దకు వెళ్లి వారి ఓటును సేకరించారని తెలిపారు. హోమ్ ఓటింగ్ సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, అధికార బృందాల పని తీరును నిశితంగా పర్యవేక్షించడం జరిగిందన్నారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లే అవసరం లేకుండా, ఇంటి వద్ద నుండే ఓటు వేసేలా ఎన్నికల సంఘం హోమ్ ఓటింగ్ సదుపాయాన్ని అందుబాటులోకి తేవడం వల్ల సీనియర్ సిటిజన్లు, దివ్యంగులకు ఎంతో వెసులుబాటు లభించిందని, ఇళ్ల వద్దనే వారు ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని కలెక్టర్ తెలిపారు. హోమ్ ఓటింగ్ కోసం నియమించబడిన బృందాలు ఆయా రూట్లలో తిరుగుతూ, ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలను తు.చ తప్పకుండా పాటిస్తూ ఓటింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్నాయని, ఓటర్ల ఇళ్ల వద్దనే ఓటింగ్ కంపార్ట్మెంట్ ను ఏర్పాటు చేసి, ఓటు గోప్యతకు ఏమాత్రం భంగం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకున్నామని వివరించారు. వీడియో చిత్రీకరణతోపాటు సూక్ష్మ పరిశీలకులు ఈ ప్రక్రియను నిశితంగా పరిశీలన జరుపుతున్నామని తెలిపారు. చేవెళ్ళ పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలో మొత్తం 1115 మంది ఓట్ ఫ్రమ్ హోమ్ సదుపాయాన్ని వినియోగించుకోనుండగా, వీరిలో 85 సంవత్సరాలకు పైబడిన సీనియర్ సిటిజన్ ఓటర్లు 695 మంది, దివ్యంగ ఓటర్లు 420 మంది ఉన్నారని కలెక్టర్ తెలిపారు. ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా, నూటికి నూరు శాతం గోప్యతను పాటిస్తూ పూర్తి పారదర్శకంగా హోమ్ ఓటింగ్ జరిపిస్తున్నామని అన్నారు. చేవెళ్ళ పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలో మొత్తం 54 బృందాలు హోమ్ ఓటింగ్ లో పాల్గొంటున్నాయని, ప్రతి బృందంలో పీ.ఓ, ఓపీఓతో పాటు మైక్రో అబ్జర్వర్, వీడియో గ్రాఫర్, పోలీస్ సిబ్బంది ఉన్నారని తెలిపారు. హోమ్ ఓటింగ్ కోసం అర్హత పొందిన వారికి అధికారుల బృందం వచ్చే సమాచారాన్ని ముందస్తుగానే క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా తెలియజేయడం జరిగిందన్నారు. ఎలాంటి అనుమానాలకు తావులేకుండా గోప్యతను పాటిస్తూ, వీడియో చిత్రీకరణ నడుమ ఈ.సీ నిబంధనలకు అనుగుణంగా హోమ్ ఓటింగ్ ప్రక్రియను జరిపిస్తున్నామని తెలిపారు. హోమ్ ఓటింగ్‌కు సంబందించిన సమాచారాన్ని ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులతో పాటు రాజకీయ పార్టీల ప్రతినిధులకు ముందస్తుగానే తెలియజేయడంతో పలుచోట్ల వారు కూడా పరిశీలిస్తున్నారని అన్నారు. ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగించుకుంటున్న వారు తాము ఏ అభ్యర్థికి ఓటు వేశామనే విషయాన్ని ఇతరులు ఎవరికీ తెలుపకుండా గోప్యంగా ఉంచుతూ, స్వేచ్ఛయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని, నచ్చిన అభ్యర్థికి ఓటు వేయాలని కలెక్టర్ సూచించారు. ఈ హోమ్ ఓటింగ్ ప్రక్రియలో కలెక్టర్ వెంట రాజేందర్ నగర్ ఎఆర్ఓ వెంకట్ రెడ్డి, హోమ్ ఓటింగ్ టీం సభ్యులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్సీబీ హ్యాట్రిక్ విక్టరీ

**ఐపీఎల్ 2024లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు హ్యాట్రిక్ విజయాలు నమోదు చేసింది. శనివారం బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్‌ను 4 వికెట్ల తేడాతో చిత్తు చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్.. 148 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించగా.. ఆర్సీబీ మరో 38 బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. దీంతో భారీగా నెట్‌రన్‌రేట్ పెంచుకుని పాయింట్ల పట్టికలో ఏడో స్థానానికి చేరింది.**

## పాయింట్ల పట్టికలో 7వ స్థానానికి..

## ప్లేఆఫ్స్ ఆశలు సజీవం.. ఇక మామూలుగా ఉండదు!



© BCCI



ఐపీఎల్ 2024లో మిణుకుమిణుకు మంటున్న ప్లేఆఫ్స్ ఆశలను సజీవంగా ఉంచుకుంటూ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు హ్యాట్రిక్ విజయాలను నమోదు చేసింది. శనివారం సొంతగడ్డపై గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 4 వికెట్లు తేడాతో ఘన విజయం సాధించింది. గుజరాత్ నిర్దేశించిన 148 పరుగుల లక్ష్యాన్ని మరో 38 బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

148 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు అదిరే ఆరంభం దక్కింది. ఓపెనర్లు ఫాఫ్ డుప్లెసిస్, విరాట్ కోహ్లీలు పోటీపడి బౌండరీలు బాదడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. వీరిద్దరి ధాటికి ఆర్సీబీ 5.4 ఓవర్లలో 92/0తో నిలిచింది. ఫాఫ్ డుప్లెసిస్ (23 బంతుల్లో 64), విరాట్ కోహ్లీ (27 బంతుల్లో 42 రన్స్) చెలరేగారు. దీంతో పది ఓవర్లలోపే మ్యాచ్ ముగుస్తుందని అంతా భావించారు. కానీ స్వల్ప వ్యవధిలో వికెట్లు తీసిన గుజరాత్ పోటీలోకి వచ్చింది. ఓ దశలో 92/0తో నిలిచిన ఆర్సీబీ.. 117/6తో నిలిచింది.

వేగంగా ఆడే ప్రయత్నంలో విల్ జాక్స్ (1), రజత్ పటీదార్ (2), గ్లెన్ మ్యాక్స్‌వెల్ (4), కామెరూన్ గ్రీన్ (1) స్వల్ప స్కోరుకే ఔట్ అయ్యారు. దీంతో గుజరాత్ టైటాన్స్ మ్యాచ్‌లోకి బలంగా వచ్చింది. కానీ దినేశ్ కార్తిక్ (12 బంతుల్లో 21), స్వప్నిల్ సింగ్ (9 బంతుల్లో 15) గుజరాత్ ఆశలపై నీళ్లు చల్లారు. దీంతో ఆర్సీబీ..13.4 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. గుజరాత్ బౌలర్లలో జాషువా లిటిల్ 4, నూర్ అహ్మద్ 2 వికెట్లు తీశారు.

అంతకుముందు బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్.. 19.3 ఓవర్లలో 147 పరుగులకు ఆలౌట్ అయింది. షారుఖ్ ఖాన్ (37), రాహల్ తెవాటియా (35) రాణించారు. ఆర్సీబీ బౌలర్లలో మహమ్మద్ సిరాజ్ 2, యశ్ దయాల్ 2, విజయ్ కుమార్ వైశాక్ 2, కామెరూన్ గ్రీన్ 1, కర్ణ్ శర్మ1 వికెట్ తీశారు.

ఈ మ్యాచ్ విజయంతో ఆర్సీబీ రెండు పాయింట్లతో పాటు భారీ నెట్‌రన్‌రేట్‌ను సంపాదించుకుంది. దీంతో పాయింట్ల పట్టికలో పదో స్థానం నుంచి ఏడో స్థానానికి చేరింది. ఈ సీజన్‌లో ఆడిన 11 మ్యాచుల్లో నాలిగింట్లో గెలిచింది ఆర్సీబీ. మిగతా మూడు మ్యాచుల్లో గెలిస్తే ఆ జట్టుకు ప్లే ఆఫ్స్ అవకాశాలు ఉంటాయి.




# 'ఈ సీజన్‌లో ముంబై కథ ముగిసింది..

## అతనే ఈ వరుస ఓటములకు కారణం'

ఐపీఎల్ 2024 టోర్నీలో ముంబై ఇండియన్స్‌కు మరో ఓటమి ఎదురైంది. ఈ టోర్నీని ముంబై ఇండియన్స్ ఓటమితో ప్రారంభించింది. ఈ సీజన్ ఆరంభంలో వరుసగా మూడు పరాజయాలను చవిచూసింది. ఆ తర్వాత పునరాగమనం చేసి మూడు మ్యాచ్‌లు గెలిచింది. అయితే ఆ తర్వాత వరుసగా ఐదు మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. కోల్‌కతా చేతిలో ఓటమితో ఈ సీజన్ లో ముంబై ఇండియన్స్ కథ దాదాపుగా ముగిసినట్టే. ప్రస్తుతం ఆ జట్టు 6 పాయింట్లతో తొమ్మిదో స్థానంలో ఉంది. మిగిలిన మూడు మ్యాచ్‌లు గెలిచినా కూడా పెద్దగా ఉపయోగపడదు. కాబట్టి ఈ మూడు మ్యాచ్‌లు లాంఛనప్రాయంగా మాత్రమే ఉంటాయి. ఎందుకంటే నెట్ రన్ రేట్ మెరుగు పరుచుకోవడం చాలా కష్టం. కాగా, కోల్ కతాతో జరిగిన మ్యాచ్ లో ముంబై విజయం సాధించేలా కనిపించింది. కానీ అనూహ్యంగా ఓటమిని ఎదుర్కోవాల్సి వచ్చింది. ఈ ఓటమి తర్వాత ఇర్ఫాన్ పఠాన్ ఒక ప్రశ్న లేవనెత్తాడు. ముంబై వరుస ఓటములకు మొత్తం కెప్టెన్ హార్దిక్ పాండ్యా నే కారణమని బాంబ్ పేల్చాడు. హార్దిక్ పాండ్యాను కెప్టెన్‌గా చేయాలనే నిర్ణయం తప్పని ఇర్ఫాన్ పఠాన్ అన్నాడు. 'క్రికెట్‌లో కెప్టెన్ పాత్ర కీలకం. పాండ్యా నాయకత్వంలో చాలా సమస్యలు ఉన్నాయి. MI బృందం కాగితంపై చాలా బలంగా కనిపిస్తుంది. కానీ మైదానంలో ఆట మాత్రం దారుణంగా ఉంది. హార్దిక్ నిర్ణయాలు ఎవరికీ అర్థం కావడం లేదు. గత మ్యాచ్ లో ఒకానొక దశలో కోల్‌కతా 5 వికెట్లు కోల్పోయింది. అయితే ఆ సమయంలో పార్ట్‌టైమ్ బౌలర్ నమన్ ధీర్‌తో 3 ఓవర్లు వేయించాలనేది చాలా తప్పుడు నిర్ణయం. దీంతో KKR బ్యాటర్లు కోలుకున్నారు. భారీ భాగస్వామ్యాన్ నెలకొల్పారు. ఫలితంగా MI ముందుగానే వారిని ఆల్ అవుట్ చేసే అవకాశాన్ని కోల్పోయింది. నమన్ ధీర్‌కు బదులుగా హార్దిక్ జట్టులోని ప్రధాన బౌలర్లకు బంతిని అందజేసి ఉండాల్సింది. అని ఇర్ఫాన్ సూచించాడు. 'హార్దిక్ పాండ్యా మొదటి నుంచి తప్పులు చేస్తూనే ఉన్నాడు. అతని నాయకత్వంలో జట్టు సమష్టిగా ఆడకపోవడం పెద్ద సమస్య. కెప్టెన్‌ని ఆటగాళ్లందరూ అంగీకరించాలి. పాండ్యా విషయంలో మాత్రం అలా కనిపించడం లేదు. ఐపీఎల్ 2024లో జట్టు పరిస్థితి దారుణంగా ఉంది' అని ఇర్ఫాన్ పఠాన్ అన్నాడు.

# ఐపిఎల్‌తో ఎంజాయ్ చేస్తున్న షారూఖ్



గతేడాది వరుస విజయాలతో దూసుకెళ్లిన బాలీవుడ్ బాద్ షా షారుక్ ఖాన్ ప్రస్తుతం ఐపీఎల్ మ్యాచ్‌లను ఎంజాయ్ చేస్తున్నారు. తన సొంత జట్టైన కోల్‌కతా నైట్ రైడర్స్ కు మద్దతుగా తీరిక లేకుండా గడుపుతున్నారు. ఈ క్రమంలో తన తదుపరి ప్రాజెక్ట్‌ను ఇప్పటి వరకూ ప్రారంభించలేదు. మరోవైపు అభిమానులు మాత్రం షారుక్ తదుపరి ప్రాజెక్ట్ పై ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం సినిమాలనుంచి కాస్త విరామం తీసుకుంటున్నట్లు షారుక్ తెలిపారు. ఈ మేరకు ఓ ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని బాద్ షా వెల్లడించారు. 'మూడు సినిమాలతో గతేడాది మొత్తం బిజీగా గడిపాను. శరీరాన్ని చాలా కష్టపెట్టా. అందుకే ఇప్పుడు కొంచెం విశ్రాంతి తీసుకోవాలని నిర్ణించుకున్నా. అంతేకాకుండా ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ ఆడే ప్రతి మ్యాచ్‌కు హాజరవుతానని జట్టుకు మాటిచ్చాను. అందుకే నా తర్వాతి సినిమా షూటింగ్ జూన్, ఆగస్టులో సెట్స్‌పైకి వెళ్లేలా చేసుకున్నా. ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటూ ఐపీఎల్ మ్యాచ్‌లను ఎంజాయ్ చేస్తున్నాను. ఇప్పుడు నేను ఇక్కడ ఉండటం చాలా ముఖ్యం. అన్ని మ్యాచ్‌లకూ హాజరయ్యేందుకు ప్రయత్నిస్తున్నాను' అని షారుక్ చెప్పకొచ్చాడు. షారుక్‌కు గత ఏడాది బాగా కలిసొచ్చింది. పఠాన్, జవాన్, డంకీ చిత్రాలతో హ్యాట్రిక్ హిట్ కొట్టారు. ఓ అగ్ర హీరో కేవలం ఏడాది వ్యవధిలో మూడు భారీ విజయాలను సొంతం చేసుకోవడం అరుదైన విషమయని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి.



# ప్రభాస్ ప్రేమకథా చిత్రమ్

గడిచిన కొన్నేళ్లల్లో ప్రభాస్ సరైన ప్రేమకథలో నటించలేదు. అన్ని యాక్షన్ తరహా చిత్రాలే. ఇప్పుడు ప్రేమకథకి ముహూర్తం కుదిరింది. జులై నుంచే ఆయన కొత్త ప్రేమాయణం మొదలు పెట్టనున్నారు. ప్రస్తుతం కల్కి 2898 ఎడి', 'సలార్ 2' 'రాజాసాబ్' చిత్రాలతోపాటు కన్నప్పలో అతిథి పాత్రలో కనిపించనున్నారు. వీటితోపాటు ఓ లవ్‌స్టోరీ చేయడానికి ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. హను రాఘవపూడి దర్శకత్వంలో.. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఈ సినిమాని నిర్మిస్తోంది. ఇప్పటికే స్క్రిప్ట్ పక్కాగా సిద్ధమైనట్టు సినీ తెలిసింది. ప్రేమ ప్రధానంగా సాగే పీరియాడిక్ యాక్షన్ కథతో ఈ చిత్రం ఉండబోతున్నట్టు సమాచారం. 'సీతారామం' తర్వాత హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. కథానాయిక ఎంపిక పక్రియ జరుగుతోంది. మరో పక్క మ్యూజిక్ సిట్టింగ్స్ కూడా జరుగుతున్నాయని సమాచారం. ప్రభాస్ హీరోగా తెరకెక్కుతున్న 'కల్కి 2898 ఎ.డి' జూన్ 27న విడుదల కానుంది.



# విజయ్ దేవరకొండ కొత్త సినిమా ప్రకటన

రాజావారు రాణిగారు సినిమాతో తెలుగు ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చాడు దర్శకుడు రవికిరణ్ కోలా. కిరణ్ అబ్బవరం హీరోగా, రహస్య గోరక్ హీరోయిన్‌గా 2019లో వచ్చిన ఈ చిత్రం మంచి విజయాన్ని నమోదు చేసింది. ఇక తన మొదటి సినిమాతోనే సక్సెస్ అందుకున్న కిరణ్, ఇప్పుడు వరుస అవకాశాలతో దూసుకుపోతున్నాడు. ఇదిలా ఉంటే ఈ సినిమా దర్శకుడు రవికిరణ్ కోలా తన కొత్త ప్రాజెక్ట్ అనౌన్స్ చేసిన విషయం తెలిసిందే. టాలీవుడ్ టాప్ ప్రొడక్షన్స్ సంస్థ అయిన శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ తన కొత్త ప్రాజెక్ట్‌ను రవికిరణ్ కోలాతో చేయబోతున్నట్లు గతేడాది సోషల్ మీడియాలో ప్రకటించింది. అయితే ఈ ప్రకటన వచ్చిన అనంతరం కొత్తగా ఎటువంటి అప్‌డేట్‌ను ఇవ్వలేదు. తాజాగా ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి సాలిడ్ అప్‌డేట్‌ను పంచుకుంది. రవికిరణ్ కోలా దర్శకత్వంలో వచ్చే ఈ ప్రాజెక్ట్‌లో రౌడీ హీరో విజయ్ దేవరకొండ హీరోగా నటించబోతున్నాడు. రూరల్ యాక్షన్ డ్రామాగా రాబోతున్న ఈ మూవీకి సంబంధించి మరిన్ని వివరాలను మే 09న ప్రకటించబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ ప్రాజెక్ట్ సంబంధించి మరిన్ని అప్‌డేట్‌ల కోసం చూస్తూనే ఉండండి అంటూ శ్రీ వెంకటేశ్వర బ్యానర్ సోషల్ మీడియాలో రాసుకోచ్చింది.

# ముగింపు దశకు డబుల్ ఇస్మార్ట్ షూటింగ్



టాలీవుడ్ నుంచి వస్తున్న మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్‌లో 'డబుల్ ఇస్మార్ట్'ఒకటి. ఎనర్జిటిక్ యాక్టర్ రామ్ పోతినేని , డాషింగ్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ కాంబోలో ఈ సినిమా వస్తుండగా.. ఈ ఇద్దరి కలయిలకలో వచ్చిన ఇస్మార్ట్ శంకర్‌కు సీక్వెల్‌గా ఈ చిత్రం వస్తుంది. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుపుకుంటున్న విషయం తెలిసిందే. అయితే ఈ సినిమాకు సంబంధించి తాజా షెడ్యూల్ ముంబైలో స్టార్ట్ అయినట్లు చిత్రయూనిట్ రాసుకోచ్చింది. పూరీ ముంబైలో డబుల్ ఇస్మార్ట్ క్లైమాక్స్ ఫైట్ సీన్ ప్లాన్ చేశాడని.. ఈ సీన్ కోసం ఏకంగా రూ.7 కోట్లు పెడుతున్నాడని టాక్. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ యాక్టర్ సంజయ్ దత్ విలన్‌గా నటిస్తున్నాడు. ఫస్ట్ పార్టుకు అదిరిపోయే మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందించిన మణిశర్మ సీక్వెల్‌కు అదిరిపోయే ఆల్బమ్ రెడీ చేస్తున్నట్టు ఫిలింనగర్ సర్కిల్ టాక్. ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా జూన్ 14న తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేస్తున్నారు. పూరీ కనెక్ట్స్ బ్యానర్ తెరకెక్కిస్తోన్న ఈ మూవీ ఆడియో రైట్స్‌ను పాపులర్ మ్యూజిక్ లేబుల్ ఆదిత్య మ్యూజిక్ దక్కించుకుంది.



# అదే నిజమైన విలాసం!

## కానీ అందులో నిజం లేదు

గూఢచారి, మేజర్ చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైంది శోభిత ధూళిపాళ్ల. ఈ భామ నటించిన హాలీవుడ్ చిత్రం 'మంకీ మ్యాన్' ఇటీవలే విడుదలైంది. ఈ సినిమాలో ఆమె అభినయానికి మంచి ప్రశంసలు దక్కాయి. ఇదిలావుండగా తెలుగు ఇండస్ట్రీకి చెందిన ప్రముఖ హీరోతో ఈ భామ ప్రేమలో ఉందని ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజా ఇంటర్వ్యూలో ప్రేమ గురించి తన అభిప్రాయాన్ని వెల్లడించింది. 'ప్రేమ అద్భుతమైన భావన. మన జీవితాన్ని నడిపించే ఇంధనం. ప్రతి ఒక్కరికి కావాల్సిన నిజమైన విలాసం ప్రేమనే' అంటూ సమాధానమిచ్చింది. ఈ మాటలతో ఆమె ప్రేమాయణం నిజమే అనుకుంటున్నారు. తన కెరీర్ గురించి ఈ భామ మాట్లాడుతూ ' తెరపై నేను పోషించిన పాత్రలను చూసి నిజజీవితంలో కూడా కఠినంగా ఉంటానని చాలా మంది అనుకుంటున్నారు. కానీ అందులో నిజం లేదు. స్వతహాగా నేను సున్నిత మనస్కురాలిని. ఎలాంటి ఆర్భాటాలు లేకుండా చాలా సింపుల్‌గా ఉంటాను. ప్రతి విషయంలో ఇతరులపై ఆధారపడతాను. చిన్న ఆనందాలకు కూడా పొంగిపోతాను' అని చెప్పుకొచ్చింది.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.